క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

కాకినాడ క్రైం/సామర్లకోట: తమ ప్రేమ వివాహాన్ని పెద్దలు కాదనడంతో తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లికి చెందిన యువతి ఆత్మహత్యా యత్నానికి ఒడిగట్టింది. సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుచురాపల్లికి చెందిన ఆర్.మీనాక్షి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. అతడు పిఠాపురంలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తమ వివాహానికి ఆమె పెద్దలు అనుమతి నిరాకరించారు. ఆ విషయాన్ని తన భర్తకు చెప్పేందుకు ఆమె తిరుచురాపల్లి నుంచి వస్తోంది. ఈ క్రమంలో రైలు సామర్లకోట వద్దకు వచ్చాక అతనికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో అతడు వాళ్లు ఒప్పుకోనపుడు తన వద్దకు మాత్రం ఎందుకు అవసరం లేదు వెళ్లిపో అని బదులిచ్చాడు. దీంతో మనస్తాపానికి గురైన మీనాక్షి డోలో 650 ట్యాబ్‌లెట్లు 20 మింగేసింది. అపస్మారక స్థితికి వెళ్లిన ఆమెను తోటి ప్రయాణికులు జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు. అక్కడ పోలీసులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

రెండు నుంచి నూకాలమ్మ జాతర

బోట్‌క్లబ్: స్థానిక పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు మార్చి 2 నుంచి ఏప్రియల్ 15 జరుగుతాయని ఆలయ ఈఓ ఎం.వీరభద్రరావు గురువారం విలేకర్లకు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

శ్రీపీఠంలో మహాన్నదానం



శ్రీపీఠంలో భక్తులకు అన్న ప్రసాదం వడ్డన చేస్తున్న పరిపూర్ణానంద స్వామీజీ

కాకినాడ రూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట శ్రీపీఠంలో గురువారం మహాన్నదానం నిర్వహించారు. ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించి, అనంతరం అన్న ప్రసాదాన్ని భక్తులకు పరిపూర్ణనంద స్వామి చేతులు మీదుగా వడ్డించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

ప్రతి గ్రామంలో నీటి కుంటలు నిర్మించాలి



ఉపాధి పనులపై సమీక్షిస్తున్న ఏపీఓ రమణకుమార్

కరప: గ్రామాల్లో రైతులకు ఉపయోగపడేలా నీటి కుంటలు నిర్మించేలా తగిన స్థలాన్ని గుర్తించాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ జీవీ రమణ కుమార్ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, సిబ్బందితో ఆయన సమావేశమై ఉపాధిపనులపై సమీక్షించారు. గ్రామాల్లో రైతులను కలసి వారికి అనువైన ప్రాంతాన్ని గుర్తించి పంటపొలాల్లో నీటినిల్వల కోసం నీటి కుంటలు నిర్మించాలన్నారు. ఉపాధి పథకం పనుల్లో వేగం పెంచి, ఎక్కువ మందికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ రమణకుమార్ కోరారు. టెక్నికల్ అసిస్టెంట్లు కేజే ప్రకాష్, టి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి

గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమీనాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873



కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్



సామర్లకోటలో ఓటింగ్ సరళిని పరిశీలించిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు



పిఠాపురంలో బారులు తీరిన ఓటర్లు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- డివిజన్‌లో 71.30 శాతం పోలింగ్
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా కూటమి నాయకులు
- సీఐ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు

పెద్దాపురం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం పెద్దాపురం డివిజన్‌లో ప్రశాంతంగా ముగిసింది. ట్రైనీ కలెక్టర్, ఇన్‌చార్జి ఆర్డీఓ హెచ్‌ఎస్ భావన, ఆర్డీఓ కె.శ్రీరమణి ఎన్నికల పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ముగిసింది. డివిజన్ వ్యాప్తంగా 19967 మంది పట్టభద్రుల ఓటరు ఉండగా 14,237 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 71.30 శాతం పోలింగ్ జరగినట్లు ఆర్డీఓ తెలిపారు. అలాగే పెద్దాపురం మండలంలో 3802 మంది ఓటర్లుకు గాను 2596 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలో 68.28 శాతం పోలింగ్ జరిగిందన్నారు.

సామర్లకోట: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. మండల, పట్టణ పరిధిలో 2,538 పురుషులు, 1,752 మంది స్త్రీ ఓట్లు ఉన్నారు. వీరిలో 1736 మంది పురుషులు, 1074 మంది స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. వీరి కోసం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మూడు, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ బూత్-98లో 812 మంది, 99లో 903 మంది ఓటర్లు ఉన్నారు.. బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ బూత్ 100లో 927 మంది ఓటర్లు, 101 బూత్‌లో 899 మంది ఓటర్లు, 102 బూత్‌లో 749 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పాఠశాలల వద్ద కూటమి నాయకులు భారీ ఎత్తున మోహరించారు. ఎమ్మెల్యే రాజప్ప ఓటు హక్కు వినియోగించుకున్న పోలింగ్ కేంద్రానికి పార్టీ నాయకులు పోలింగ్ బూత్‌లోనికి చొరబడినప్పటికీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించారు. వృద్ధులు, దివ్యాంగులు తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు.



కొత్తపల్లి పోలింగ్ కేంద్రం వద్ద క్యూ కట్టిన ఓటర్లు



పిఠాపురంలో ఓటు హక్కు వినియోగించుకోడానికి వచ్చిన బాలింత

కొత్తపల్లిలో 72 శాతం నమోదు

కొత్తపల్లి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 72 శాతం నమోదయింది. 1834 మంది ఓటర్లకు గాను 1320 మంది ఓటు హక్కును వినిమోగించుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో 696 మందికి 509, జెడ్పీ పాఠశాలలో 656 మందికి 474, 481 మందికి 337 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ పరిశీలించారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పిఠాపురంలో 68.90 శాతం..

పిఠాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పిఠాపురం, గొల్లప్రోలులలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. పిఠాపురం పట్టణంలో ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాల, మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహించారు. ఆరు పోలింగ్ కేంద్రాల్లో 4300 మంది ఓటర్లు ఉండగా 2639 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 61.37గా నమోదైంది. పోలింగ్ తీరును కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, తహసీల్దార్ వీవీ గోపాలకృష్ణ, సీఐ శ్రీనివాస్ పర్యవేక్షించారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో మూడు పోలింగ్ కేంద్రాల్లో 1836 మంది ఓటర్లుకు 1265 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 68.90 శాతంగా నమోదైంది. అడిషనల్ ఎస్పీ భాస్కరరావు పోలింగ్ తీరును పర్యవేక్షించారు.



చంటి బిడ్డతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళ

అనోస్మియాతో వాసన చూసే శక్తి కోల్పోతాం



ప్రముఖ ఈఎన్‌టీ వ్యాధి నిపుణుడు లక్ష్మణ్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: అనోస్మియా వ్యాధి వస్తే వాసన చూసే శక్తి కోల్పోతామని ప్రముఖ ఈఎన్‌టీ వ్యాధి నిపుణులు లక్ష్మణ్ ప్రసాద్ అన్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అనోస్మియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైరల్ ఇన్ఫెక్షన్‌లు, తలకు గాయాలు, ముక్కులో పాలిప్స్, కొన్ని మందులు, నాడీ సంబంధ రుగ్మతల వల్ల ఇది సంభవిస్తుందన్నారు. దీని వల్ల గ్యాస్ లీకేజీలు, పొగవంటి వాసనలు గుర్తించే సామర్థ్యం దెబ్బ తింటుందన్నారు. దీనికి తక్షణ వైద్య సహాయం తీసుకోవడం చాలా అవసరమన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ ప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్మోగిన శివ పంచాక్షరి

- పాదగయకు పోటెత్తిన భక్తులు
- కనుల పండువగా లింగోద్భవ అభిషేకాలు
- విశేషాలంకారాలలో స్వామి, అమ్మవార్లు
- వైభవంగా కుక్కుటేశ్వరుని రథోత్సవం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల రెండో రోజు గురువారం కూడా భక్తుల తాకిడి కొనసాగింది. సుమారు 20 వేల మందికి పైగా భక్తులు పుష్కరిణిలో స్నానాలు చేశారు. తెల్లవారు జామున లింగోద్భవ పూజల అనంతరం భక్తులు ఆలయంలో కుక్కుటేశ్వర స్వామి దర్శనానికి బారులుతీరారు. స్వామివారికి అభిషేకం, రాజరాజేశ్వరీ దేవికి లక్షకుంకుమార్చన, లక్షచామంతి పూజలతో సేవించారు. ఉదయం 8 గంటలకు పంచామృత అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో పాదగయ వీధులన్నీ కిటకిటలాడాయి.



స్వామి, అమ్మవార్ల దర్శనానికి బారులు తీరిన భక్తులు


నియోజకవర్గంలో పలు శివాలయాల్లో లింగోద్భవ అభిషేకాలు నిర్వహించారు.

కనుల పండువగా రథోత్సవం

ఉమా కుక్కుటేశ్వరస్వామి వారి దివ్య రథోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. మధ్యాహ్నం నాకబలి, దండాడింపు, దొంగలదోపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయం నుంచి కుంతీమాధవస్వామి వారి ఆలయం వద్ద ఉన్న రథాలపేట వరకు తీసుకువచ్చారు. అనంతరం రాత్రి విచిత్ర వేషాలు, బ్యాండుమేళాల నడుమ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యాలు విచిత్ర వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉప్పాడ సెంటర్లో బాణసంచా కాల్చారు. ఆలయ ఈఓ జగన్మోహన్ శ్రీనివాస్ పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, విచిత్ర వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



దుర్గాడ రామలింగేశ్వరస్వామి వారి లింగోద్భవ అభిషేకం



కుక్కుటేశ్వరస్వామికి లింగోద్భవ అభిషేకాలు చేస్తున్న అర్చకులు



రథోత్సవానికి ఉత్సవమూర్తులను తీసుకువెళ్తున్న ఆలయ సిబ్బంది, అధికారులు

కోలాహలంగా భీమేశ్వరుని రథోత్సవం

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- భారీ ఎత్తున పోలీసు బందోబస్తు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామభీమేశ్వర స్వామి రథోత్సవం పట్టణంలో కోలాహలంగా జరిగింది. గురువారం సాయంత్రం ఈ రథోత్సవాన్ని ప్రారంభించారు. రథాన్ని వారం రోజుల ముందే గాంధీచౌక్‌కు తరలించారు. అక్కడ రథానికి, పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. గోదావరి కాలువ ఆవలివైపు ఉన్న పంచారామ క్షేత్రం నుంచి స్వామి వారి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను పల్లకిపై బాణ సంచా కాల్పుల నడుమ రైల్వే గేటు మీదుగా గాంధీచౌక్ సెంటర్‌కు తీసుకువచ్చారు. ఉత్సవ విగ్రహాలకు ఆలయ పండితులు అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ ప్రత్యేక పూజలు చేశారు. రథానికి ఎదురుగా ఏర్పాటు చేసిన కుంభం మీదుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, భక్త సంఘం అధ్యక్షుడు బిక్కిన సాయి రథాన్ని కదిలించారు. గాంధీచౌక్ నుంచి పెద్దవీధి, బళ్లమార్కెట్ సెంటర్, గొల్లగూడెం, నీలమ్మచెరువు, దేవిచౌక్ మీదుగా తిరిగి గాంధీచౌక్‌కు రథోత్సవం చేరింది. స్వామి, అమ్మవార్లను తిలకించడానికి దారి పొడవునా భక్తులు బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త పసల పద్మరాఘవరావు, భక్త సంఘం నాయకులు ఆర్వీ సుబ్బరాజు, గంజి బూరయ్య, రథోత్సవ కమిటీ నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



సామర్లకోట చంద్రశేఖరస్వామి రథోత్సవాన్ని ప్రారంభించిన ఆవాల లక్ష్మీనారాయణ, రాజేశ్వరి తదితరులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు

రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కోలసంబరం, వీరభద్రుని సంబరం, గారడీ, మ్యూజికల్ బ్యాండ్, పులి వేషాలు, కాళికాదేవి వేషం, తాంబూళ మేళం, నాగ ఆఘోరి నృత్యం, తీన్ మార్, కేరళ రెక్కల డ్యాన్సు, డాల్స్, పొడుగు కాళ్ల ప్రదర్శన, హనుమంతుని వేషం, చైనా కొబ్రా, లక్క గుర్రాలు, దాండియా నృత్య సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ప్రజా ప్రతినిధులు, రైతులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు, భక్త సంఘ నాయకులు, రైతు సంఘ నాయకులు, భక్తులకు సేవలందించారు. డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ ఎ.కృష్ణ భగవాన్ పర్యవేక్షణలో 10 మంది ఎస్సైలు, 35 మంది పోలీసు కానిస్టేబుళ్లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాయీ బ్రాహ్మణ కళాకారులకు సత్కారం

రథోత్సవంలో భాగంగా మ్యూజికల్ బ్యాండ్‌లో పాల్గొన్న కళాకారులను నాయి బ్రాహ్మణ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు సత్కరించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: శివరాత్రిని పురస్కరించుకుని మండలంలో ఉన్న పలు శివాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న బాలాత్రిపుర సమేత రాజశేఖర స్వామి, ఉప్పాడలో మత్స్యలింగేశ్వరస్వామి, చాడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, ఎండపల్లిలో మాణిక్యాంబ సమేత రాలింగేశ్వర స్వామి, గోర్స ఉమా రామలింగేశ్వర స్వామితో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర రాజశేఖరస్వామి ఆలయంలో భక్తి పాటల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తీర్థం, రథోత్సవం, కోలాటం నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో చంద్రశేఖరస్వామి రథోత్సవం

సామర్లకోట: స్థానిక పాత సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో గురువారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 24వ తేదీన స్వామి వారి కల్యాణం జరగడంతో మహాశివరాత్రి మరుసటి రోజు రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ పండితులు డి.పాపయ్యశాస్త్రి, చీమలకొండ వెంకటరమణల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి ఆధ్వర్యంలో రథోత్సవాన్ని వైఎస్సార్ సీపీ అయ్యారక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, అయ్యారక కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ ఆవాల రాజేశ్వరి దంపతులు ప్రారంభించారు.



సామర్లకోటలోని భీమేశ్వరస్వామి రథోత్సవం



సామర్లకోట రథోత్సవంలో కాళికా మాతల నృత్యాలు



లక్క గుర్రాల డ్యాన్సు



ఆకట్టుకున్న నాగా అఘోరీల నృత్యం



పంచారామ క్షేత్ర రథోత్సవంలో కేరళ రెక్కల డాన్సు



నాయీ బ్రాహ్మణ కళాకారులను సత్కరించిన కౌన్సిలర్ వీరభద్రరావు